# 114. అన్ నాస్ (మానవులు) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 6 ఆయతులు ఉన్నాయి. షైతాన్ నుంచి అల్లాహ్ శరణు కోరుకోవాలని ఈ సూరా ముఖ్యంగా బోధించింది. ఈ సూరాలోని మొదటి ఆయతు మొదలు అనేక ఆయతుల్లో ఈ సూరాకు పేరుగా పెట్టబడిన పదం 'నాస్' (మానవులు) ప్రస్తావనకు వచ్చింది. షైతాన్ దుర్మార్గం నుంచి అల్లాహ్ శరణు కోరుకోవాలని ఈ సూరా ప్రబోధించింది. షైతాన్ మానవాళికి ప్రధానశత్రువు. అల్లాహ్ యావత్తు మానవాళికి ప్రభువనీ, ఆయనే అందరి చక్రవర్తి, అందరి ఆరాధ్య దైవమనీ తెలిపింది. షైతాన్ మన హృదయాలలో భ్రమలు కలిగిస్తాడనీ, ఆ విధంగా మన విశ్వాసాన్ని దెబ్బ తీయడానికి ప్రయత్నిస్తాడనీ, మంచిచెడుల విచక్షణ కోల్పోయేలా చేస్తాడని వివరించింది.

## 114. అన్ నాస్[1] సూరా

## سُوْرَةُ النَّاسِ

అవతరణ :మక్కా ఆయతులు :6

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○

1 (ఈ విధంగా) చెప్పు : "నేను మానవుల ప్రభువు రక్షణ కోరుతున్నాను.[2]

قُلْ اَعُوْذُ بِرَبِّ النَّاسِ ①

2 మానవుల చక్రవర్తిని,[3]

مَلِكِ النَّاسِ ②

3 మానవుల ఆరాధ్య దైవాన్ని (ఆశ్రయిస్తున్నాను)[4] –

اِلٰهِ النَّاسِ ③

1. దీని మహత్తు గురించి ఇంతకుముందే చెప్పటం జరిగింది. వేరొక హదీసులో ఇలా ఉంది: ఒకసారి దైవప్రవక్త (సఅసం) నమాజు చేస్తూ ఉండగా ఆయనకు తేలు కుట్టింది. నమాజు ముగించిన తరువాత ఆయన (స) ఉప్పు, నీరు తెప్పించి తేలుకుట్టినచోట పూసారు. ఆ తరువాత ఆయన (స) **ఖుల్ యా అయ్యుహల్ కాఫిరూన్... , ఖుల్‌హు వల్లాహు అహద్...., ఖుల్ అవూజు బిరబ్బిన్నాస్** సూరాలు పఠించసాగారు. (మజ్‌మవుజ్జవాయెద్ – 5/111).

2. 'ప్రభువు' (రబ్బ్) అనే పదం చాలా విస్తృత భావంలో ఉంది. మనిషి తల్లి కడుపులో పడినప్పటినుంచీ ఆయన అతన్ని పోషిస్తాడు. అంచెలవారీగా అతన్ని తీర్చిదిద్దుతాడు. ఆ విధంగా మనిషి పెరిగి పెద్దవాడవుతాడు. మరి ఈ నిర్వహణ, పరిపోషణ కొందరికి మాత్రమే ప్రత్యేకం కాదు. సమస్త మానవులకు వారికి కావలసిన వాటిని సమకూరుస్తాడు. కేవలం మానవులకేనా !? అంటే మానవులకు మాత్రమే కాదు, సమస్త సృష్టిరాశులకు ఆయన పోషకత్వం వర్తిస్తుంది. ఈ సూరాలో మాత్రం ఒక్క మానవుల విషయమే ప్రస్తావించబడింది.

3. సమస్త జనుల జీవికకు కావలసిన వస్తుసామగ్రినంతటినీ సమకూర్చి, వారిని నిత్యం కనిపెట్టుకుని ఉన్నవాడు మాత్రమే వాస్తవానికి ఈ జగతికి పాలకుడు, చక్రవర్తి, రాజాధిరాజు కాగలుగుతాడు.

4. సమస్త జగతిని నడిపేవాడు, సమస్త విశ్వానికి సామ్రాట్టు అయినవాడే జనుల దాస్యానికి, ఆరాధనలకు అర్హుడు కాగలడు. అందువల్ల నేను ఆ గొప్ప శక్తిమంతుని శరణు జొచ్చుతున్నాను.

| | |
|---|---|
| **4** దురాలోచనలను రేకెత్తించి, తప్పించుకునేవాడి కీడు నుండి,[5] | مِنۡ شَرِّ الۡوَسۡوَاسِ ۙ الۡخَنَّاسِ ۪ۙ﴿۴﴾ |
| **5** వాడు జనుల హృదయాలలో దురాలోచనలను రేకెత్తిస్తాడు – | الَّذِىۡ يُوَسۡوِسُ فِىۡ صُدُوۡرِ النَّاسِۙ ﴿۵﴾ |
| **6** – వాడు జిన్ను వర్గానికి చెందినవాడైనా సరే, మానవ వర్గానికి చెందినవాడైనా సరే![6] | مِنَ الۡجِنَّةِ وَالنَّاسِ ﴿۶﴾ |

5. 'దురాలోచన' (వస్వస) లేక దుష్ప్రేరణ అనేది చాలా మెల్లగా, శబ్దం లేకుండా నూరిపోయబడుతుంది. షైతాన్ కూడా మనిషి అంతర్యంలో ఎంతో చాకచక్యంగా, తెలీకుండా ఈ దుష్టభావాలను కలుగజేస్తాడు. **'ఖన్నాస్'** ( الۡخَنَّاسِ ) అంటే జారుకునేవాడు, తప్పించుకునేవాడు, వెనక్కి తగ్గేవాడు, మరలిపోయేవాడు, తోక ముడిచేవాడు అని అర్థం. ఈ గుణాలు షైతాన్‌లో పుష్కలంగా ఉంటాయి. ఈ ధూర్తుడు దైవనామస్మరణ జరుగుతున్నప్పుడు మెల్లగా జారుకుంటాడు. దైవధ్యానం పట్ల ఏమరుపాటుకు లోనైనపుడు అమాంతం మనిషి మనసును ఆవరిస్తాడు.

6. దురాలోచనలను రేకెత్తించేవారిలో రెండు రకాల వారున్నారు.

**మొదటి రకం:** మానవులను పెడత్రోవ పట్టించే శక్తిని దేవుడు జిన్నుల్లోని షైతానులకు ఇచ్చి ఉన్నాడు. అదీగాక ప్రతి మనిషి వెంట ఒక షైతాను ఉంటాడు. వాడతన్ని ఎంతసేపటికీ మార్గం తప్పించేందుకు యత్నిస్తుంటాడు. ఈ విషయాన్ని దైవప్రవక్త (స) తన సహచరులకు తెలియజేసినప్పుడు, "ఓ దైవప్రవక్తా (సఅసం)! వాడు తమరిని కూడా వెన్నంటి ఉంటాడా?" అని సహచరులు అడిగారు. దానికాయన(స) "అవును. నావెంట కూడా ఉంటాడు. అయితే వాడికి వ్యతిరేకంగా అల్లాహ్ నాకు తోడ్పడ్డాడు. అందువల్ల వాడు నాకు లొంగిపోయాడు. వాడు నాకు మంచిని గురించి తప్ప మరే విషయంలోనూ శాసించడు" అని బదులిచ్చారు. (సహీహ్ ముస్లిం – ప్రళయదిన లక్షణాల ప్రకరణం).

అలాగే వేరొక హదీసు ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఏతెకాఫ్‌లో ఉండగా, ఆయన్ని పలకరించటానికి ఆయన (స) ధర్మపత్ని హజ్రత్ సఫియా (ర.అన్హా) మస్జిదుకు వచ్చారు. అది రాత్రి సమయం. ఆయన (స) ఆమెను ఇంటి దగ్గర వదలిపెట్టడానికి ఆమె వెంట నడిచారు. దారిలో ఇద్దరు అన్సార్ సహచరులు ఎదురుపడ్డారు. ఆయన (స) వారిని బిగ్గరగా పిలుస్తూ, "ఈవిడగారు ఎవరో కాదు, ఈమె నా ధర్మపత్నియగు

సఫియా బిన్తె హుయి" అని వివరించారు. ప్రియసహచరులు ఈ మాట విని "దైవప్రవక్తా (సఅసం)! ఇదంతా మీరు మాకు చెప్పాలా?! మీ పట్ల మాకు దురనుమానం కలుగుతుందా?!" అని చెప్పగా, "అది సరేననుకోండి. కాని షైతాను మాత్రం అలాంటివాడు కాడు. వాడు మనిషి నరాల్లో రక్తంలా ప్రవహిస్తూ ఉంటాడు. వాడు మీ ఆంతర్యాల్లో ఎక్కడ దురాలోచనను రేకెత్తిస్తాడోనని నాకు భయమేసింది" అని మహాప్రవక్త (సఅసం) విశదీకరించారు. (సహీహ్ బుఖారీ – ఆదేశాల ప్రకరణం).

**రెండవ రకం :** ఇక రెండవ రకం షైతానులు మానవుల్లోనే ఉంటారు. వారు ఎదుటివారి బాగోగులను కోరేవారుగా, ప్రేమానురాగాలు గలవారుగా నటించి మనుషులను పెడదారి పట్టిస్తారు.

మరి కొంతమంది ప్రకారం షైతాను మనుషులను, జిన్నులను కూడా దారి తప్పించే వాడై ఉంటాడు. జిన్నులు కూడా షైతాను మాయమాటలకు, దుష్ప్రేరణలకు మోస పోతుంటారు.

**(శుభ సమాప్తం)**